MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 290- | పేజీలు : 8 | శుక్రవారం 9 అక్టోబర్ 2026 | వెల : 6-00



గోదావరి-కావేరి అనుసంధానంతో

దక్షిణాదిలో అద్భుత ఫలితాలు

కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్

- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు
- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిపై ప్రధానికి వివరించిన సీఎం
- 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

ఢిల్లీ, మహానగర్:

గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాదిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీతో గురువారం భేటీ అయిన సీఎం రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, వ్యవసాయం, సాగునీరు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు తాజా పరిస్థితితో పాటు గోదావరి-కావేరి అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్‌వర్క్, విద్యుత్ గ్రిడ్ ఏర్పాటు చేసిన తరహాలో నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్తే వాటర్ గ్రిడ్‌కు మార్గం సుగమమవుతుందని చెప్పారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, పుష్కరాల అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం ప్రత్యేక - మిగతా2లో



జాతీయ ప్రముఖులకు విజయవాడ ఉత్సవ్ 2.0 ఆహ్వాన పత్రికలు

- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానం
- విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వైభవాన్ని, విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రత్యేకతలను వివరించిన ప్రజాప్రతినిధులు
- జాతీయ స్థాయిలో విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ఉత్సవ నిర్వహణ

ఢిల్లీ, మహానగర్

విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయి ప్రముఖులను ఆహ్వానించే కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి ఉత్సవాలకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం కలిసి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్ బాబు కలిసి - మిగతా2లో



సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

5



సుప్రీం క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు

- జస్టిస్ దీపాంకర్ దత్తా
- దేశంలో పెరిగిపోతున్న నేరాల గురించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- గతంలో హత్య కేసుల్లో శిక్షలు 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ఆధారంగా ఉండేది
- 'క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి

దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది



- టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకే 'డిజిటల్ ఇండియా'
- డిజిటల్ ఇండియా అనేది టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ప్రయత్నమే
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మోదీ ప్రసంగించారు.
- "డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది
- గత 10-12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది
- మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువు

5

- సిఫార్సులు అవసరం లేకుండా సామాన్య భక్తులకు నేరుగా ప్రత్యేక దర్శనం
- రోజుకు వెయ్యి ప్రత్యేక దర్శనం టికెట్లు మాత్రమే
- 'మన మిత్ర' వాట్సాప్ ద్వారా రేపు మధ్యాహ్నం 2 గంటలకు టికెట్ల విడుదల
- రూ.1,000 టికెట్‌తో ఒక వైపు ఉచిత బస్సు రవాణా, బంగారు వాకిలి నుంచి సమీప దర్శనం



జగన్మాత దివ్య దర్శన్ @ రూ.1,000

విజయవాడ, మహానగర్:

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సామాన్య భక్తులు ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా అమ్మవారిని దర్శించుకునేందుకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం 'జగన్మాత దివ్య దర్శన్' - మిగతా2లో

ఏపీలో అవకాశాలకు ఆకాశమే హద్దు



- 2 ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడుల సాధన
- ఏఐ ఆధారిత సాంకేతికతతో పెరిగిన పన్ను వసూళ్లు
- 15 ఏళ్లలో భిన్నమైన భారత దేశం
- సీఐఐ భాగస్వామ్య సదస్సు
- సన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఢిల్లీ, మహానగర్:

ఆంధ్రప్రదేశ్ ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా వెంటనే అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. గురువారం ఇక్కడ జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు వివరించారు. "మరో 15 ఏళ్లలో భిన్నమైన భారత్‌ను చూడబోతున్నారు. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడానికి అమెరికాకు శతాబ్దం పట్టింది. ఏషియన్ టైగర్స్ (హాంకాంగ్, సింగపూర్, - మిగతా2లో

చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం



- సీఈసీ రాజీనామా చేయాల్సిందే'
- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు
- రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన ఇండీ కూటమి నేతలు
- కన్నాట్‌ప్లేస్ నుంచి రాజ్‌ఘాట్‌కు ర్యాలీగా చేరుకున్న ఇండీ కూటమి నేతలు
- మోదీ, అమిత్ షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద నేతల ప్రార్థనలు

5

ఏపీలో అవకాశాలకు ఆకాశమే హద్దు

-మొదటిపేజీ తరువాయి

ద.కొరియా, తైవాన్‌)కి 60–70 ఏళ్లు పట్టింది. చైనా 40–50 ఏళ్లు తీసుకొంది. 1990లో భారత్, చైనాలు దాదాపు ఒకేస్థాయిలో ఉండేవి. ఇప్పుడు నాలుగున్నర రెట్ల పెద్ద ఆర్థికవ్యవస్థగా చైనా ఎదిగింది. భారత్ రాబోయే 15–20 ఏళ్లలో కొత్తరూపు సంతరించుకోబోతోంది. మోదీ నాయకత్వంలో భారత్‌ను ఎవరూ ఆపలేరు. ఇప్పుడు పెట్టుబడులు పెట్టకపోతే శాశ్వతంగా అవకాశాలు కోల్పోతారు. ఆంధ్రప్రదేశ్‌లో మేం 15% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందువల్ల ఆకాశమే హద్దుగా ఏదైనా సాధించడానికి ఇక్కడ అవకాశం ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని సీఎం తెలిపారు. గత 24 నెలల్లో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులతో కూడిన 714 ప్రాజెక్టులు సాధించగలిగామని చెప్పారు. ఇది దేశంలో అత్యధికం అని ప్రకటించారు. ఇప్పటివరకు రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టుల అమలుకు ప్రభుత్వం జీవోలు విడుదల చేసినట్లు చెప్పారు. రూ.4.7 లక్షల కోట్ల విలువైన 247 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. వాటిలో గూగుల్ గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలున్నట్లు చెప్పారు. ఇప్పటికి పనులు మొదలైన ప్రాజెక్టుల ద్వారా 7.1 లక్షల ఉద్యోగాలు రావడానికి వీలుందన్నారు. క్రితంసారి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పారిశ్రామిక ప్రోత్సాహకాల పంపిణీకి ఎస్క్రో ఖాతా ఎందుకు ప్రారంభించకూడదని అడిగారని, ఈ ఏడాది విశాఖపట్నం సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం సందర్భంగా నవంబర్ 12న ఎస్క్రో ఖాతా ప్రారంభించనున్నామని ప్రకటించారు. ఆ రోజు నుంచి ఎవరూ పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, ఆన్‌లైన్‌లో రియల్ టైంలో జమచేస్తామని వెల్లడించారు. ఆగ్నేయాసియాకు ఆంధ్రప్రదేశ్‌ను గేట్‌వేగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటించారు.

నీటి వనరులు, గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి

గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ ఆధారిత సాంకేతికతను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహించేందుకు విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని

'25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీకి అభినందనలు. దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. డిజిటల్ మౌలిక వసతులు, అద్భుతమైన రహదారి నెట్‌వర్క్‌తో భారత్ దూసుకుపోతోందన్నా, రైల్వే నెట్‌వర్క్‌లోనూ కీలక స్థానంలో నిలిచిందన్నా అంతా మోదీ ఘనతే' అని సీఎం పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించడంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారు. ఆయన చేయూతతో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును 2027 మార్చిలో ప్రారంభించబోతున్నాం. ఇటీవల రూ.లక్ష కోట్లతో శంకుస్థాపన చేసిన రాయలసీమ హార్టికల్చర్ హబ్‌ను ముందుకు తీసుకెళ్లడానికి భాగస్వాముల అవసరముంది. తిరుపతిలో సెమీకండక్టర్ ఎకో సిస్టం అభివృద్ధి చేయడానికి 10వేల ఎకరాల భూమి కేటాయిస్తున్నాం' అని సీఎం చెప్పారు.

భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఏపీ పాత్ర కీలకం

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్

భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దిల్లీలో గురువారం నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహక కార్యక్రమంలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు. "సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయి. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తోపాటు అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు అవుతుండటం గర్వకారణం.

కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాలా దేశ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నాయి. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఎన్డీయే ప్రభుత్వం ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష అనే విధానంతో ముందుకు సాగుతోంది. సాంకేతిక, విశ్వాసం, వాణిజ్యం, ప్రతిభ, సంప్రదాయం అనే ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని గత భాగస్వామ్య సదస్సులో నేను సూచించా. ఏపీ ఈ అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని చూరగొంటూ పెట్టుబడులు సాధిస్తోంది. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై ఏపీలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలి. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్రాలు, పారిశ్రామికరంగం కలిసి పనిచేయాలి" అని పిలుపునిచ్చారు.

జాతీయ ప్రముఖులకు విజయవాడ ఉత్సవ్ 2.0 ఆహ్వాన పత్రికలు





-మొదటిపేజీ తరువాయి

ఆహ్వాన పత్రికలు అందించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ఎంపీలు సానా సతీష్ బాబు, లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు కలిసి ఆహ్వానించారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను ఎంపీలు కేశినేని శివనాథ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్ రావు, ఎంపీ భరత్ కలిసి ఆహ్వానించి విజయవాడ దసరా ఉత్సవాల వైభవాన్ని, విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రత్యేకతలను వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్ బాబు, బైరెడ్డి శబరి కలిసి ఆహ్వానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఎంపీలు కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు, ఎంపీ భరత్ కలిసి ఆహ్వానించారు. అలాగే బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను విజయవాడ ఉత్సవ్ ప్రతినిధులు తిరుమలేష్, నరసింహారావు కలిసి ఆహ్వానించారు. విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించడంతో పాటు నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక విశిష్టతను దేశవ్యాప్తంగా చాటేలా నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రపతి నుంచి ముఖ్యమంత్రుల వరకు ప్రముఖులకు ఆహ్వానాలు అందించడం ద్వారా విజయవాడ ఉత్సవ్ 2.0ను నగర ఉత్సవానికే పరిమితం కాకుండా జాతీయ స్థాయి వేదికగా నిలిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో అద్భుత ఫలితాలు

-మొదటిపేజీ తరువాయి

ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 53 శాతం లోటు వర్షపాతం నమోదై వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు తీసుకున్న చర్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, విశాఖ మెట్రో, బీచ్ రోడ్డు వంటి మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను కూడా వివరించారు. ఇదిలా ఉండగా, 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో మోదీ సాధించిన ఘనతను కొనియాడుతూ, దూరదృష్టి, స్పష్టమైన లక్ష్యాలు, దృఢమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.

జగన్మాత దివ్య దర్శన్ @ రూ.1,000

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజూ 1,000 ప్రత్యేక దర్శనం టికెట్లను మాత్రమే ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రూ.1,000 ధర కలిగిన టికెట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక 'మన మిత్ర' వాట్సాప్ సేవ 9552300009 ద్వారా పొందవచ్చని చెప్పారు. తొలి రోజు దర్శనం టికెట్లను రేపు మధ్యాహ్నం 2 గంటలకు విడతల వారీగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. టికెట్ పొందిన భక్తులకు కుమ్మరిపాలెం సెంటర్‌లోని టీటీడీ స్థలం నుంచి దేవస్థాన బస్సులో కొండపైకి ఒక వైపు ఉచిత రవాణా కల్పిస్తారు. ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ ద్వారా ఆలయంలోకి అనుమతించి బంగారు వాకిలి (ముఖ మండపం) నుంచి అమ్మవారి సమీప దర్శనం కల్పిస్తారు. ఈ ప్రత్యేక దర్శనం ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. నైవేద్యాలు, నివేదనల సమయంలో దర్శనం నిలిపివేస్తారు. భక్తులు ఎవరినీ ఆశ్రయించకుండా స్వయంగా 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా టికెట్లు పొందాలని ఈవో సూచించారు.

పారదర్శకంగా మద్యం దుకాణాల లాటరీ

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రక్రియ




విజయవాడ, మహానగర్

జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026–27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఎన్‌టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల నేపథ్యంలో నిరసనలు, ర్యాలీలు వద్దు

- ఈ నెల 9 నుంచి 21 వరకు పోలీసులకు సహకరించాలి
- అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత



విజయవాడ, మహానగర్

నగరంలో ఈ నెల 11 నుంచి 20 వరకు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0, పున్నమి ఘాట్‌లో నిర్వహించే జాతీయ సరస్ మేళా నేపథ్యంలో ఎలాంటి నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించకుండా రాజకీయ, సంస్థాగత కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత కోరారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలు, వివిధ రంగాలకు చెందిన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యూనియన్ల ప్రతినిధులతో గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా హోల్డింగ్ ఏరియాలు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రపతి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు వంటి వీవీఐపీల పర్యటనలు, భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది పూర్తిగా నిమగ్నమై ఉంటారని, అందువల్ల పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు పలు సమస్యలు, సూచనలు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని డీసీపీ హామీ ఇచ్చారు. నగరంలో సీసీ కెమెరాలు, ఆధునిక సాంకేతికత వినియోగంతో నేరాల నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను ప్రతినిధులు అభినందించారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులకు పూర్తిగా సహకరిస్తామని వారు తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ ఏసీపీ భాను ప్రకాష్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి. కనకారావు, బాల రాజాజీ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా రెడ్ రన్ మారథాన్

- హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన కల్పించడమే లక్ష్యం
- రాష్ట్రస్థాయి పోటీల్లో 28 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు

విజయవాడ, మహానగర్



రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీఎస్ఏసీఎస్) ఆధ్వర్యంలో మారథాన్ రెడ్ రన్--2026ను గురువారం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్షను తొలగించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఏపీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. స్మరణ రాజ్ ఐఏఎస్ తెలిపారు. బెలూన్లు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదనే అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, యువతను భాగస్వాములను చేయడం ద్వారా హెచ్ఐవీ ముప్పును తగ్గించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అన్ని జిల్లాల్లో నిర్వహించిన రెడ్ రన్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి మారథాన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని ప్రాంతీయ, జాతీయస్థాయి మారథాన్‌లకు పంపనున్నట్లు వెల్లడించారు. 28 జిల్లాల నుంచి పాల్గొన్న పోటీల్లో పురుషుల విభాగంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు జివిడి డిగ్రీ కళాశాలకు చెందిన ఎం. నరేష్ ప్రథమ బహుమతి రూ.35 వేలు, అదే కళాశాలకు చెందిన ఎన్. నిరంజన్ ద్వితీయ బహుమతి రూ.25 వేలు, రాజమండ్రి ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె. మణికంఠ తృతీయ బహుమతి రూ.10 వేలు గెలుచుకున్నారు. మహిళల విభాగంలో బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఈ. స్వాతి ప్రథమ బహుమతి రూ.35 వేలు, మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాలకు చెందిన బి. స్పందన ద్వితీయ బహుమతి రూ.25 వేలు, విశాఖపట్నం బీవీకే జూనియర్ కళాశాలకు చెందిన జి. గాయత్రి తృతీయ బహుమతి రూ.10 వేలు సాధించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఏసీఎస్ అధికారులు, వైద్యులు, క్రీడా సిబ్బంది, జిల్లా సిబ్బంది, దిశా సిబ్బంది, భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి

జిల్లాలో 38 క్షయ రహిత పంచాయతీలు

సీహెచ్‌వోలకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జోష్ (జాయింట్ స్ట్రాడ్ ఫర్ హెల్త్) కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా గురువారం ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 38 గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చేతులు మీదుగా ఎంపికైన 38 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వోలు)లకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది, యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, చికిత్సను పూర్తిగా అందించడం, ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించడం ద్వారా జిల్లాను క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్, జిల్లా క్షయ నివారణ అధికారి డా. బి.భానునాయక్, జిల్లా యువజన అధికారి ప్రదీప్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయవాడ ఉత్సవ్ జిజ్ఞాస పోటీలు ప్రారంభం

ఏడు విభాగాల్లో 100కు పైగా పోటీలు.. ఆన్‌లైన్‌లో 6 వేల మందికి పైగా నమోదు





విజయవాడ, మహానగర్

సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్--2.0లో భాగంగా కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిజ్ఞాస నిర్వహిస్తున్న సాంస్కృతిక, కళా పోటీలు గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిజ్ఞాస ఆధ్వర్యంలో ఏడు విభాగాల్లో 100కు పైగా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా 6 వేల మందికి పైగా నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి రోజే చిన్నారులు, యువత, పెద్దలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నగరంలోని కళా, సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేందుకు జిజ్ఞాస నిర్వహిస్తున్న పోటీలు ఉపయోగపడుతున్నాయని అన్నారు. పిల్లలు, యువత తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని తెలిపారు. విజయవాడ ఉత్సవ్‌ను ప్రతి ఒక్కరూ తమ సొంత పండుగగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేశినేని ఫౌండేషన్ తరఫున పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకి లక్ష్మి మాట్లాడుతూ పోటీలకు భారీ స్పందన రావడం సంతోషకరమన్నారు. పిల్లలు, యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి, పట్టాభి సతీమణి చందన, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ప్రతినిధులు, జిజ్ఞాస బృందం సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాకారులు పాల్గొన్నారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



విజయవాడ, మహానగర్

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సామాన్య భక్తుల సౌకర్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ రూ.100, రూ.300, రూ.500 దర్శనం టికెట్లను రద్దు చేసి ఉచిత సర్వదర్శనాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఎక్కువసేపు క్యూలో వేచి ఉండలేని భక్తుల కోసం రూ.1,000 శీఘ్ర దర్శన సదుపాయం కల్పించారు. కుమ్మరిపాలెం నుంచి ప్రత్యేక ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. వినాయక ఆలయం నుంచి సుమారు 1,650 మీటర్ల మేర క్యూ మార్గాన్ని ఏర్పాటు చేసి ఒకేసారి 8,500 మంది వేచి ఉండేలా చర్యలు తీసుకున్నారు. వర్షాలు, తుపాను పరిస్థితుల్లో టోల్‌గేట్ మార్గాన్ని మూసివేస్తే మహామండపం ర్యాంపు మీదుగా ప్రత్యామ్నాయ క్యూ మార్గాన్ని సిద్ధం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మూడు భారీ హోల్డింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 18 వేల మంది వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. 54 ప్రాంతాల్లో తాగునీరు, 370 మరుగుదొడ్లు, 600 జల్లుస్నానాలు, లడ్డూ కౌంటర్లు, లడ్డూ ఏటీఎంలను అందుబాటులో ఉంచారు. నూతన అన్నదాన భవనంలో నిరంతరం అన్నప్రసాదం అందించనున్నారు. భద్రత కోసం ముఖ గుర్తింపు, క్యూఆర్ కోడ్ తనిఖీలు, బూమ్ బారియర్లను ఏర్పాటు చేశారు. దేవస్థానం, పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది కలిపి 5,000 మందికి పైగా మూడు షిఫ్టుల్లో సేవలు అందించనున్నారు. ఉత్సవాల తొలి రోజు ఉదయం 8 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఓటర్ల జాబితాలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పి సీఈవోలు, డీపీవోలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ముందు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సిబ్బంది శిక్షణ తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు సన్నద్ధత, అవసరమైన సామగ్రి, పోలింగ్ స్టేషన్లలో అవసరమైన ప్రాథమిక వసతులు, ఎన్నికల సిబ్బంది శిక్షణను మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రి-పోలింగ్, పోలింగ్ రోజు, కౌంటింగ్, సిబ్బంది విధులు, బాధ్యతలకు సంబంధించిన మాడ్యూల్ వారీ శిక్షణ వీడియోలు, లింక్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగు

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు



విజయవాడ, మహానగర్

మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు

దేశం నలుమూలల నుంచి నుంచి 600 స్టాళ్ల వరకు ఏర్పాటు

నాణ్యవంతమైన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

హిందాల్కోతో వీ బిజినెస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

విజయవాడ



ప్రముఖ టెలికాం సంస్థ వీ ఎంటర్‌ప్రైజ్ విభాగమైన వీబిజినెస్, అల్యూమినియం, రాగి రంగాల్లో అగ్రగామి సంస్థ హిందాల్కో ఇండస్ట్రీస్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఒడిశాలోని రాయగడ జిల్లాలో ఉన్న హిందాల్కో బాక్సి మాలి బాక్సైట్ గనిలో ప్రత్యేక ప్రైవేట్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. అనుసంధానిత, చురుకైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన గనులను నిర్మించడమే లక్ష్యంగా హిందాల్కో ఈ నెట్‌వర్క్‌ను అమలు చేస్తోంది. స్పెక్ట్రమ్, కోర్, రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ మేనేజ్‌డ్ సర్వీసెస్‌తో కూడిన పూర్తి ప్రైవేట్ నెట్‌వర్క్ వ్యవస్థ గని కార్యకలాపాలకు సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ బ్యాక్‌బోన్‌గా పనిచేయనుంది. వీ ప్రైవేట్ నెట్‌వర్క్ ద్వారా కార్మికుల భద్రత, ఫ్లీట్ మేనేజ్‌మెంట్, డ్రోన్లు, సీసీటీవీ నిఘా, రియల్‌టైమ్ మానిటరింగ్, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరిచే డిజిటల్ సేవలను అమలు చేయవచ్చు. కేంద్రీకృత పర్యవేక్షణ, డేటా ఆధారిత నిర్ణయాల కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ భాగస్వామ్యం సంక్లిష్ట పారిశ్రామిక వాతావరణాలకు అనుగుణంగా ప్రైవేట్ నెట్‌వర్క్‌లను రూపొందించడంలో తమ సామర్థ్యాన్ని చాటుతుందని వీ బిజినెస్ చీఫ్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ ఆఫీసర్ ఎం.పి. సునీల్ కుమార్ తెలిపారు.

ఇన్‌స్టామార్ట్‌లో క్విక్ ఇండియా మూవ్‌మెంట్

విజయవాడ



పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రముఖ క్విక్ కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్ తన వార్షిక క్విక్ ఇండియా మూవ్‌మెంట్ విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇన్‌స్టామార్ట్, స్విగ్గీ యాప్‌లలో అందుబాటులో ఉన్న ఈ సేల్‌లో ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు, అందం, వ్యక్తిగత సంరక్షణ, బొమ్మలు, రోజువారీ అవసరాల వస్తువులపై 50 నుంచి 90 శాతం వరకు తగ్గింపులు అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఆపిల్, శాంసంగ్, జేబీఎల్, లెగో, నింజా, బాష్, ఫిలిప్స్, బోట్ తదితర ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై ప్రత్యేక ధరలు అందుబాటులో ఉన్నాయి. ఆపిల్ ఐఫోన్ 17 ప్రో 256 జీబీ రూ.1,19,999, మ్యాక్‌బుక్ రూ.66,900, జేబీఎల్ స్పీకర్ రూ.3,999, మ్యాగ్‌సేఫ్ పవర్ బ్యాంక్ రూ.999 నుంచి లభిస్తున్నాయి. అందం, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులపై 80 శాతం వరకు, గృహ, వంటగది ఉత్పత్తులపై 90 శాతం వరకు తగ్గింపు ఉంది. రోజువారీ అవసరాల వస్తువులు రూ.9 నుంచే ప్రారంభమవుతున్నాయి. ఎంపిక చేసిన బ్యాంకు కార్డులతో అదనపు తగ్గింపులు, క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు పొందవచ్చని సంస్థ పేర్కొంది.

కొత్త తరం కోసం ఒప్పో ఎఫ్35 సిరీస్

విజయవాడ:



భారతదేశంలో ఒప్పో ఎఫ్ సిరీస్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒప్పో సంస్థ కొత్త ఎఫ్35 సిరీస్‌ను విడుదల చేసింది. ఇందులో ఎఫ్35 ప్రో, ఎఫ్35 మోడళ్లు ఉన్నాయి. 100 డిగ్రీల విస్తృత దృశ్య పరిధితో 50 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ నేచురల్ సెల్ఫీ కెమెరాను ఇందులో అందించారు. దీంతో గ్రూప్ సెల్ఫీల్లో ఎక్కువ మందిని ఒకే ఫ్రేమ్‌లో బంధించవచ్చని సంస్థ తెలిపింది. ఎఫ్35 ప్రోలో ఓఐఎస్ సదుపాయంతో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ కెమెరా, 4కే వీడియో రికార్డింగ్, డ్యూయల్-వ్యూ వీడియో, కొత్త పోర్ట్రెయిట్ మోడ్ ఉన్నాయి. ఎఫ్35లో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 2.5కే వీడియో రికార్డింగ్ సదుపాయాలు ఉన్నాయి. రెండు ఫోన్లలోనూ కలర్ఓఎస్ 16 ఆధారిత కృత్రిమ మేధ సదుపాయాలు, 8,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్, ఐపీ69కే నీరు, ధూళి నిరోధకత ఉన్నాయి. ఎఫ్35 ప్రోలో మీడియాటెక్ డైమెన్సిటీ 7360 మ్యాక్స్, ఎఫ్35లో డైమెన్సిటీ 6360 మ్యాక్స్ ప్రాసెసర్లు ఉన్నాయి. అక్టోబర్ 11 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఎఫ్35 ప్రో ధర రూ.45,999 నుంచి, ఎఫ్35 ధర రూ.38,999 నుంచి ప్రారంభమవుతుంది.

ఈసీ వర్సెస్ సుప్రీం


భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింభారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాఎఖీ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం-6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని నిన్న (సోమవారం) సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఫారం-6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది.మరోవైపు ఫారం-6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది.కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం-6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం-6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మరో వైపు ఏఐఎంఐఎం ప్రెసిడెంట్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయంపై స్పందించారు. ఫామ్ 7 దరఖాస్తుల పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుమతామని హెచ్చరించారు. ఫామ్ 7 పేరుతో తప్పుడు దరఖాస్తులు లేదా అప్పీళ్లు సమర్పిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరారు.ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది."ఫామ్ 7 దరఖాస్తుల విషయంలో అనర్హమైనవి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.మరోవైపు, 'సర్' ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఫామ్ 7 కింద దాదాపు నాలుగువేలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని,వారిలో ఎక్కువ మంది ముస్లిం ఓటర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. .మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

పతకాలు చెప్పే పాఠం



నువ్వా నేనా అన్నట్టు తలపడే క్రీడోత్సవాల్లో కూడా యుద్ధంలో మాదిరే అవతలి పక్షంపై గెలిచి తీరాలన్న తపన, పట్టుదల ఉంటాయి. ఈర్ష్య, అహంకారం వంటివీ అప్పుడప్పుడు కనబడకపోవు. కానీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెప్పినట్టు ప్రపంచాన్ని మార్చే శక్తి, కోట్లాదిమందికి ప్రేరణగా నిలిచే సామర్థ్యం, ప్రపంచ పౌరుల్ని ఒక్కటిచేసే సత్తా క్రీడలకే ఉంటుంది. జపాన్‌లోని నగోయాలో రెండు వారాలు కొనసాగి, ఎన్నో అద్భుతాలు ప్రపంచానికందించిన ఆసియా క్రీడల సంరంభం ఆదివారం ముగిసింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా క్రీడాకారుల తర్వాత పతక విజేతల్లో మన ఆటగాళ్లది నాలుగో స్థానం. 2023నాటి చైనా క్రీడోత్సవాల్లోనూ మన స్థానం అదే గనుక ఫర్వాలేదన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ సంఖ్యరీత్యా ఈసారి తీసికట్టే. గతంలో 28 స్వర్ణపతకాలు గెలుచుకున్న మన దేశం ఇప్పుడు 21కి సరిపెట్టుకోవాల్సివచ్చింది. వెండి పతకాల్లో చూస్తే 38 నుంచి 28కి పడిపోయాం. కాంస్యంలోనూ అంతే. గతంలో వాటి సంఖ్య 41 కాగా ఇప్పుడు 37. షూటింగ్, ఆర్చెరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో అనుకున్న స్థాయిలో స్వర్ణాలు గెలుచుకోలేకపోవటం పెద్ద లోటు. మనం నాలుగో స్థానంలో ఉన్నామన్న మాటేగానీ తొలి ముగ్గురితో పోలిస్తే చాలా దూరంలో ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు 341 పతకాలతో చైనా, 269తో జపాన్, 150తో దక్షిణ కొరియా ఉన్నాయి. గతంలో 107 పతకాలు గెల్చుకున్న మన జట్లు ఇప్పుడు 85కి పరిమితమయ్యాయి. మన క్రీడాకారుల ఎంపిక ఈసారి కొంత కఠినంగానే ఉంది. పతకాలు రాబట్టగలిగేవారినే ఎంపిక చేయాలన్న పట్టుదల కనబడింది. అందుకు నిర్దేశించిన గీటురాళ్లు కూడా చిన్నవేం కాదు. గత క్రీడోత్సవాల్లో, ఆసియన్ చాంపియన్‌షిప్, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఇతర టోర్నీల్లో తొలి ఆరుస్థానాల్లో నిలిచినవారినే జపాన్ పంపాలన్నది అందులో ముఖ్యమైన ది. గతంలో 'సొంత ఖర్చులతో వస్తాం. అవకాశమీయండి' అని అడిగే క్రీడాకారులు... మన్నించిన అభ్యర్థనలూ తక్కువేం కాదు. ఈసారి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అలాంటివారికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటీయరాదన్న కృతనిశ్చయంతో ఉంది. మెరుగ్గా ఆడేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలన్న సంకల్పం మంచిదే. ఇందువల్ల వెళ్లిన క్రీడాకారుల సంఖ్య తగ్గింది. వారిలో ఎక్కువ శాతంమంది మెడల్ రౌండ్ వరకూ వెళ్లగలిగారు. ఎప్పట్లాగే ఇతర ఈవెంట్లతో పోలిస్తే మనకు అథ్లెటిక్స్‌లోనూ, షూటింగ్‌లోనూ ఎక్కువ పతకాలొచ్చాయి. వాటిల్లో కూడా సంఖ్యాపరంగా తగ్గినట్టే. ఆసియా క్రీడోత్సవాలను ఒలింపిక్స్‌కు ముందస్తు పరీక్షలుగా భావిస్తారు. అక్కడ పనితీరునిబట్టే ఒలింపిక్స్‌లో జాతకం ఎలా ఉండబోతోందో చెప్పవచ్చంటారు. చైనా క్రీడోత్సవాలకూ, జపాన్ ఉత్సవాలకూ మధ్య మన దేశం దాదాపు రూ. 98 కోట్లు వ్యయం చేసింది. కానీ సాధించింది చాలా తక్కువే. మనకొచ్చిన స్వర్ణాల్లో కూడా అత్యధికం...అంటే 21లో 13 టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించినవే. సమష్టిగా, సమన్వయంతో ఆడి గెల్చుకోవటం ప్రశంసించదగ్గదే అయినా, ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్స్‌కు చోటుండదు. ఆటగాళ్ల పనితీరు మెరుగుపడిందా లేదా అన్నది చూడాలి తప్ప, పతకాలను చూసి అంచనాకు రాకూడదన్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆదిల్ సుమారీవాలాతో ఏకీభవించటం కొంత కష్టమే. సగం స్వర్ణాలు క్రికెట్, కబడ్డీ, హాకీ వగైరాలకే వచ్చాయి. ఇవన్నీ జట్టు సమష్టి బలాన్ని చాటాయి... నిజమే. కానీ వ్యక్తిగత ఈవెంట్లలో మరింత మెరుగ్గా ఉంటే ఒలింపిక్స్‌కు అది లాభిస్తుంది. అంతర్జాతీయ సందర్భాల కోసం కఠిన నిబంధనలతో క్రీడాకారుల ఎంపిక, శిక్షణ వగైరాలు మంచిదే. కానీ పాఠశాల స్థాయినుంచే ఈ రంగంలో అర్హులైనవారిని గుర్తించి, స్పోర్ట్స్ అథారిటీలు, అకాడెమీలద్వారా వారిని సానబడితేనే జాతీయ స్థాయిలో మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. మన బడుల్లో మంచినీరు, మరుగు దొడ్లువంటి మౌలిక సదుపాయాల కల్పనే అంతంతమాత్రం. అలాంటిచోట క్రీడలకు చోటిస్తారని ఆశించటం దురాశే. ఏదేమైనా ఇప్పుడు బయటపడిన లోటుపాట్లను నిశితంగా గమనించి సరిదిద్దుకుంటే 2028లో జరిగే లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నాటికి, 2030లో జరిగే దోహా ఆసియా క్రీడోత్సవాలనాటికి మన దేశం మరింత ఉన్నత స్థాయికెదుగుతుంది.

ధాన్యం మాయలో దోషులు ఎవరు?



రాష్ట్రంలో రైస్‌మిల్లుల యజమానుల నిర్వాకం వల్ల ప్రభుత్వానికి చెందిన కోట్ల రూపాయల బియ్యాన్ని చీకటి బజారుకు పంపిన వైనం తెలిసి జనం నివ్వెరపోతున్నారు. 'భయం లేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్టు' ప్రభుత్వం, చట్టాల పట్ల ఏమాత్రం అదురూ బెదురు లేకుండా మిల్లర్లు రాష్ట్ర ఖజానాకు భారీగా తూట్లు పొడిచారు. ఈ వ్యవహారమంతా చూస్తే తప్పు రెండు వైపులా ఉందనిపిస్తున్నది. పంట దిగుబడి తర్వాత ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించి, వచ్చిన బియ్యాన్ని నెలవారీగా పేదలకు పంపిణీ చేస్తుంది. కస్టమ్ మిల్డ్ రైస్ విధానం ప్రకారం ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులు బియ్యంగా మార్చి ఇస్తాయి. అందుకుగాను వారికి క్వింటాలు లెక్కన మిల్లింగ్, రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ధాన్యం అందిన 15 రోజుల్లో పౌరసరఫరాల శాఖకు బియ్యాన్ని అప్పగించవలసి బాధ్యత మిల్లులపై ఉంటుంది.

ఈ ఆగస్టులో సివిల్ సప్లయిస్ అధికారులు రైస్‌మిల్లుల తనిఖీలు చేపట్టగా దిమ్మతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. గత మూడేండ్లుగా ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో 2.7 లక్షల మెట్రిక్ టన్నుల దాకా లెక్కకు అందడం లేదని అధికారులు తేల్చారు. రైస్‌మిల్లుల్లో స్టాకుగా ఉండవలసిన సుమారు రూ.3,905 కోట్ల విలువైన బియ్యం గాయబ్ అయ్యాయి. ప్రభుత్వానికి అప్పగించవలసి బియ్యాన్ని మిల్లుల యజమానులు రాష్ట్రాన్ని దాటించి అధిక ధరలకు అమ్ముకున్నట్లు తెలుస్తున్నది. ఆ సొమ్ముతో వారు రియల్ ఎస్టేట్‌లో, సినిమా నిర్మాణాల్లో పెట్టుబడి పెట్టినట్టు, కొత్త రైస్‌మిల్లులు స్థాపించుకున్నట్లు విచారణలో తేలింది. పంపిణీకి సరిపడే బియ్యం మాత్రమే ఉన్నాయి, ఇప్పుడే మిల్లింగ్ చేయవద్దని చెప్పిన ఒకే మాటను సాకుగా తీసుకుని, అక్రమంగా ఆ సరుకును సరిహద్దులు దాటించారు.

రాష్ట్రంలోని రైస్‌మిల్లులు చాలావరకు ఈ నేరంలో భాగమయ్యాయి. తప్పు చేసిన చిన్నమిల్లుల యజమానులు తాము అమ్ముకున్న బియ్యం విలువను ప్రభుత్వానికి చెల్లించారు. మొత్తం రూ.3,905 కోట్లలో ఇంకా రూ.2,200 కోట్లు వసూలు కావలసి ఉన్నది. సివిల్ సప్లయిస్ చట్టాల ప్రకారం ఇలాంటి నేరాలకు పాల్పడితే వాస్తవ విలువకు తోడుగా 25 % జరిమానా విధిస్తారు. ఆ సొమ్ము చెల్లించకుంటే మిల్లును, దాని యజమాని ఆస్తులను జప్తు చేస్తారు. ఆ మిల్లును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి భవిష్యత్తులో ధాన్యం కేటాయింపు చేయరు. ఈ క్రమంలో సివిల్ సప్లయిస్ అధికారులు పలు జిల్లాల్లోని రైస్‌మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. సుమారు 360 మిల్లుల యజమానులు ప్రభుత్వ చర్యల నుంచి తమను రక్షించాలని కోర్టును ఆశ్రయించారు.

ప్రభుత్వ ఆకస్మిక తనిఖీలకు నిరసనగా తెలంగాణ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలో గత నెల 12న మిల్లులు మూతపడ్డాయి. గత పదేండ్లుగా మిల్లింగ్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం తమను దొంగల్లా చిత్రిస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. రైతుల పంటకు, ప్రజలకందే బియ్యానికి మధ్యవర్తిగా కీలక పాత్ర పోషిస్తున్న రైస్‌మిల్లులను కాపాడవలసిన అవసరం, బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అందుకోసం తాము బకాయిపడిన సొమ్ముపై 12 % వడ్డీని, 25 % జరిమానాలు విధించవద్దని మిల్లర్లు కోరుతున్నారు. సీఎంఆర్ ఒప్పందం ప్రభుత్వానికి అనుకూలంగా ఏకపక్షంగా ఉన్నదని, దానికి సవరణలు అవసరమని వారు అంటున్నారు. ఒప్పందంలో పేర్కొన్నట్లు క్వింటాలు వడ్ల నుంచి 67 కిలోల బియ్యం రావడం లేదని, తడి వల్ల కొంత బియ్యం ముక్కిపోతున్నాయని, బరువు తగ్గుతున్నాయని, ఆ నష్టాన్ని తాము భరిస్తున్నామని చెప్తున్నారు. ఈ నష్టాలతో వేగలేక చాలా మిల్లులు అమ్ముకునే పరిస్థితి ఉన్నదని వారి వాదన. మూడేండ్లుగా సరియైన నిఘా కొరవడి, ప్రజా పంపిణీ వ్యవస్థపై పట్టు లేకుండా కాలం గడిపిన పౌరసరఫరాల మంత్రిత్వ శాఖ, అధికారులు ఇప్పుడే కండ్లు తెరిచినట్లు మిల్లుల మీద పడడానికి కారణమెవరు? దీని వెనుక స్వలాభాపేక్ష రాజకీయ కోణం ఉన్నదా? లేదా అధికారుల అవినీతి బాగోతమున్నదా? అనేది ముందు తేలాలి. బెదిరిపోయిన చిన్నచేపలు బకాయిలు చెల్లించగా ఇక మిగిలినవన్నీ పెద్ద చేపలే. రూ.90 కోట్ల బకాయి ఉన్న పెద్దమిల్లులు ఇప్పుడు సర్కార్‌తో బేరసారాలకు దిగాయి. ఈ మధ్య ఓ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ విషయంపై మాట్లాడుతూ-డిఫాల్ట్ మిల్లులపై విధించిన వడ్డీ, జరిమానా తొలగింపు గురించి ప్రభుత్వంతో చర్చిస్తానని అన్నారు. గత మూడేండ్లుగా సాగుతున్న ఈ తతంగంపై ముందే పరిస్థితులు చేయి దాటిపోకుండా ప్రభుత్వం చూసుకోవాలి. చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించి ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా మొత్తం సొమ్ము ముక్కు పిండి వసూలు చేయాలి. అవన్నీ వదిలేసి మిల్లర్లకు అనుకూలంగా ప్రభుత్వం మొగ్గుచూపితే కోల్పోయిన కోట్లాది రూపాయల ప్రజాధనానికి బాధ్యత ఎవరు వహిస్తారు?

దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది

‘డిజిటల్ ఇండియా’ కార్యక్రమం టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ఒక ప్రధాన ప్రయత్నంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. సాంకేతికత అనేది డిజిటల్ అంతరాన్ని తగ్గించి, కేవలం వనరులు ఉన్న కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందాలనేదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పరివర్తనలో మొబైల్ ఫోన్‌ను కేంద్ర బిందువుగా మార్చడం ద్వారా సాధారణ పౌరులకు కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని అన్నారు. దేశ రాజధాని దిల్లీలోని యశోభూమిలో జరిగిన పదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో ఈ మేరకు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

“డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. గత 10-12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది. మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువుగా నిలిచింది. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టింది. ఆ రంగంలో మౌలిక సదుపాయాలను విస్తరించింది. మొబైల్ ఫోన్లు, ఇతర టెలికాం హార్డ్‌వేర్‌లు దేశంలోనే తయారయ్యేలా చూడటంపై దృష్టి సారించింది. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరుకుంది. ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు ఈ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగింది. దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది. “



‘మొబైల్ ఫోన్ సుపరిపాలనకు కీలకంగా మారింది’

ప్రభుత్వ పథకాల పంపిణీలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ కనెక్టివిటీ పోషిస్తున్న పాత్రను ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా రూ.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయని అన్నారు. ఆ డబ్బు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించడం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేశామని వివరించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయని వెల్లడించారు.

“ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాలకు రూ. 50 లక్షల కోట్లు చేరాయి. తత్ఫలితంగా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా అయ్యాయి. ఈ మొత్తం తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించాం. ఇలాంటి అవకతవకలను అరికట్టే ప్రయత్నాలను కొనసాగించడానికి నేను కట్టుబడి ఉన్నాను. పీఎం కిసాన్ కింద రూ. 4 లక్షల కోట్లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశాం. ఈ డబ్బు వారి ఖాతాలో జమ అయినప్పుడు రైతుల మొబైల్ ఫోన్‌లకు నోటిఫికేషన్ వస్తుంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గతంలో పొందలేని కోట్లాది మంది చిన్న రైతులకు ఈ డబ్బు అందింది. మొబైల్ ఫోన్ ఇకపై కేవలం సమాచార మార్పిడి లేదా చాటింగ్ సాధనం మాత్రమే కాదు. ఇది పౌరులకు తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చు, ఎక్కువ సౌకర్యాన్ని కల్పించింది” అని మోదీ వ్యాఖ్యానించారు.

టెలికాం రంగంలో భారత్ సాధించిన ప్రగతిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా ఈ వేదిక దేశ ప్రగతిని, దాని ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక వేదికగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం మౌలిక సదుపాయాల విస్తరణను కూడా ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలలో సెల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల విస్తరణ, డేటా మరింత అందుబాటులోకి రావడం వంటి అంశాలను వివరించారు.

ఆ మోసాలపై వరల్డ్‌వైడ్ ఫ్రేమ్‌వర్క్ ఉండాలి : మోదీ

సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్త చట్రం (ఫ్రేమ్‌వర్క్) కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలు దేశ సరిహద్దులను దాటాయని, అందుకే సంబంధిత వర్గాలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిజిటల్ మోసాలను అరికట్టడానికి ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని పొందినప్పుడే టెక్నాలజీ విస్తృత స్థాయికి చేరుకోగలదని అభిప్రాయపడ్డారు.

ఐఎంసీపై సింధియా ప్రశంసలు

భారత్‌కు ప్రపంచ సాంకేతిక ఆశయాలను ముందుకు నడిపించడానికి అవసరమైన మానవ వనరులు (మ్యాన్‌పవర్, చలనశీలత(మొబిలిటీ), దృక్పథం(మైండ్‌సెట్) ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అభిప్రాయపడ్డారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) దేశ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి ప్రదర్శించే వేదికగా పరిణామం చెందాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకే డేటా అందిస్తున్న దేశాల్లో భారత్ ఒకటిగా ఉందని అన్నారు. బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య దశాబ్దం క్రితం కేవలం 6 కోట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 110 కోట్లు దాటిందని చెప్పారు.

చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం

స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. జుజుజ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్‌కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జుజుజ జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు.

“రాజ్యసభ, లోక్‌సభలకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు శాంతియుతంగా నిరసన తెలపాలని భావిస్తున్నారు. రెండు రోజులుగా మమ్మల్ని నిరసన చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. మొదటి రోజు, మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయం బయట అడ్డుకున్నారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపాలని మేము భావించాము. బుధవారం మీరు చూసినట్లుగా, మమ్మల్ని అక్కడ కూడా అడ్డుకున్నారు. మా వాళ్లపై దాడులు చేశారు. మా వాళ్లను



కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. వాస్తవం ఏమిటంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భగవత్?లు ఒక నేరపూరిత కుట్ర ద్వారా దేశాన్ని హైజాక్ చేశారు. రాజ్యాంగాన్ని నాశనం చేశారు. ఓట్లను దొంగిలించారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ప్రతిపక్షంగా మేము హామీ ఇస్తున్నాం. వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం. ఈ నలుగురిని చట్టం ముందు నిలబడటాన్ని మీరు చూస్తారు.”

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అపాయింట్‌మెంట్ కోరిన ఇండీ కూటమి

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు.

‘చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం’

ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి” అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.


రియాద్‌పై హూతీల దాడులు.. విమాన సర్వీసులు రద్దు చేసిన భారత్

సౌదీ అరేబియాలో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఆభా అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హూతీ రెబల్స్ దాడులకు పాల్పడటంతో విమాన రాకపోకలపై ప్రభావం పడింది. భద్రతా కారణాలతో భారత్‌కు చెందిన పలు విమానయాన సంస్థలు రియాద్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రియాద్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలను అక్టోబర్ 10 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థలు తెలిపాయి. రద్దైన టికెట్లకు పూర్తి రిఫండ్ లేదా ఉచితంగా మరో తేదీకి మార్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించాయి. గురువారం దిల్లీ నుంచి రియాద్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కూడా పరిస్థితుల నేపథ్యంలో తిరిగి దిల్లీకి వచ్చేసింది. అనంతరం ఆ విమానాన్ని రద్దు చేశారు. ప్రయాణికులకు పూర్తి రిఫండ్ అందిస్తామని ఎయిరిండియా తెలిపింది. కోచి నుంచి రియాద్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు కూడా రద్దయ్యాయి. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం రాత్రి బయల్దేరాల్సిన అకాసా ఎయిర్ క్యూ523, సౌదియా క్యూ775 విమానాలను రద్దు చేశారు. ఈ విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థల కస్టమర్ కేర్‌ను సంప్రదించి తదుపరి ప్రయాణ ఏర్పాట్ల గురించి తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఆభా విమానాశ్రయంపై అక్టోబర్ 6, 7 తేదీల్లో దాడులు జరిగినట్లు సౌదీ అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, 36 మంది గాయపడ్డారు. ఆభా విమానాశ్రయంలో ఇద్దరు మృతి చెందగా, 28 మంది గాయపడ్డారు. కింగ్ ఖలీద్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒకరు మరణించగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఆ దాడులకు యెమెన్‌లోని హూతీ మిలీషియా బాధ్యత వహించినట్లు సమాచారం. రియాద్ వైపు ప్రయోగించిన రెండు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. ఖమీస్ ముషైత్ వైపు వచ్చిన మరో క్షిపణిని కూడా అడ్డుకున్నట్లు వెల్లడించాయి. క్షిపణులను అడ్డుకునే సమయంలో కిందపడిన శకలాల కారణంగా రియాద్‌లోని ఓ కిండర్‌గార్టెన్, ఓ వైద్య కేంద్ర భవన సముదాయానికి నష్టం వాటిల్లినట్లు సౌదీ పౌర రక్షణ విభాగం తెలిపింది. దాడులకు ప్రతిస్పందనగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యెమెన్‌లో హూతీలకు చెందిన 82 సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించాయి. సౌదీలోని పౌరులు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్న దాడులను సహించబోమని సంకీర్ణ దళాల ప్రతినిధి హెచ్చరించారు. ఇక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపిన భారత్.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. సౌదీ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా ఉంటుందని పేర్కొంది.

భారతీయులకు సూచనలు

మరోవైపు సౌదీలోని భారతీయులకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. స్థానిక అధికారులు అధికారికంగా జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరింది. దాడులకు సంబంధించిన వీడియోలు, వార్తలను ధృవీకరణ లేకుండా ఫార్వర్డ్ చేయడం లేదా సోషల్ మీడియాలో మళ్లీ పోస్టు చేయవద్దని హెచ్చరించింది. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెద్దాలోని కాన్సులేట్ సాధారణంగానే పనిచేస్తున్నాయని తెలిపింది.

ఫ్లిప్‌కార్ట్ ‘బిగ్ బిలియన్ డేస్’లో మోటోడీల్స్



విజయవాడ

మొబైల్ టెక్నాలజీ సంస్థ, భారతదేశ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మోటరోలా, ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2026 సందర్భంగా ‘ఇట్స్ ది టైమ్ టు మోటో’ ప్రచారంలో భాగంగా చబిగ్‌బిలియన్ మోటోడీల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. మోటరోలా ఎడ్జ్ 70 ఫ్యూజన్, ఎడ్జ్ 70 ప్రో, ఎడ్జ్ 70 ప్రోం, మోటో జి37 పవర్, మోటరోలా సిగ్నేచర్ వంటి తాజా స్మార్ట్‌ఫోన్‌లపై ప్రత్యేక పండుగ ఆఫర్లు లభిస్తాయని సంస్థ తెలిపింది. సేల్ ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్‌లో ప్రారంభమైందని, బిగ్ బిలియన్ డేస్ సేల్ కొనసాగినంతకాలం మోటరోలా స్మార్ట్‌ఫోన్ పోర్ట్‌ఫోలియోపై ప్రత్యేక ధరలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. రూ.30 వేల లోపు ప్రీమియం అనుభవాన్ని కోరుకునే వినియోగదారుల కోసం మోటరోలా ఎడ్జ్ 70 ఫ్యూజన్‌ను అందిస్తోంది. ఏఐ ఆధారిత ఫోటోగ్రఫీ, క్వాడ్-కర్వ్డ్ డిజైన్, దీర్ఘకాలిక బ్యాటరీతో ఈ ఫోన్ రూపొందింది. ఏఐ ఆధారిత 50 మెగాపిక్సెల్ సోనీ లైటియా 710 కెమెరా వివిధ లైటింగ్ పరిస్థితుల్లో ఫోటోలు, వీడియోలను స్పష్టంగా క్యాప్చర్ చేస్తుంది. 1.5కె ట్రూ కలర్ క్వాడ్-కర్వ్డ్ డిస్‌ప్లేకు పాంటోన్ వాలిడేషన్ ఉండటంతో కచ్చితమైన రంగులు, లీనమయ్యే వీక్షణ అనుభవం లభిస్తుందని సంస్థ వెల్లడించింది. పండుగ సందర్భంగా కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలుదారులకు ఈ ఆఫర్లు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపింది.

సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, ‘సర్’ ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

సుప్రీం క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు

మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమా గుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు ‘అరుదైన వాటిలో అత్యంత అరుదైన’ సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు.

‘క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి’

‘సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే’ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్?ను పెంచాలి : సుప్రీంకోర్టు


మరోవైపు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

‘గుండాల గుండెల్లో వణుకు పుట్టాలి’

కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముఖ్యంగా దిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని పేర్కొంది. దిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని దిల్లీ పోలీసులను కోరింది. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి దిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని స్పష్టం చేసింది. దేశ రాజధాని నగరమైన దిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని చెప్పింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని సూచించింది.

మార్చి నాటికి భూసమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వం లక్ష్యం

- వీబీ జీరామ్‌జీ ద్వారా నియోజకవర్గానికి అదనంగా రూ.25 కోట్లు నిధులు మంజూరు
- రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీతో ప్రజల్లో హర్షం
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి, మహానగర్

వచ్చే మార్చి నాటికి ప్రభుత్వ పరిధిలోని భూసమస్యలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మండల పరిధిలోని కనసానపల్లి, వట్టిగుడిపాడు గ్రామాల్లో గురువారం నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొని రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులు, భూయజమానులకు పంపిణీ చేశారు. కనసానపల్లి స్వర్ణగ్రామ సచివాలయంలో కనసానపల్లి 635, నూగుండపల్లి 685, నర్సింగపాలెం 565, వట్టిగుడిపాడు రైతు సేవా కేంద్రం వద్ద వట్టిగుడిపాడు 942, కృష్ణవరం 704 పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. గ్రామసభలో ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో అధికారులను ఆదేశించిన ఆయన నాలుగు నుంచి ఆరు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని, పరిష్కరించలేని వాటిని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీబీ జీరామ్‌జీ ద్వారా నియోజకవర్గానికి అదనంగా రూ.25 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కనసానపల్లిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, వట్టిగుడిపాడులో దసరా నాటికి 200 మందికి ఇళ్ల పట్టాలు, రహదారుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రైతులు, ప్రజల ఆస్తులను కాపాడుతూ వారి హక్కులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్వే పూర్తయిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. రీ-సర్వేలో రైతులను భాగస్వాములను చేసి, వివరాలను తనిఖీ చేసి, ఈ-కేవైసీ అనంతరం పాసుపుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పాసుపుస్తకాల్లో తప్పులు ఉంటే వెంటనే తెలియజేస్తే సరిచేసి అందిస్తామని అన్నారు. పాసుపుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పట్టాదారు వివరాలు, భూమి వివరాలు, విస్తీర్ణం, స్కెచ్, రూట్ మ్యాప్, శాటిలైట్ ఇమేజీ తదితర వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులు, ప్రజల భూమి యాజమాన్య హక్కులను రక్షించామని తెలిపారు. గత పాలకులు భూవివాదాలు సృష్టించి రికార్డులు తారుమారు చేశారని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో భూములను కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గృహనిర్మాణ శాఖ ఈఈ ఎం. రామోజీ నాయక్, తహశీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్, ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలామ్, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, భూయజమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి స్నేహితునికి బాదం..
కొత్త దీపావళి ప్రచారాన్ని ప్రారంభించిన కాలిఫోర్నియా ఆల్మండ్స్



విజయవాడ

దీపావళి సందర్భంగా కాలిఫోర్నియా ఆల్మండ్స్ 'బాదం ఫర్ ఎవ్రీబడ్డీ' పేరుతో కొత్త పండుగ ప్రచారాన్ని ప్రారంభించింది. యువత తమ సాధారణ కుటుంబ బహుమతుల జాబితాను దాటి, జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించే ప్రతి స్నేహితుడికీ బాదం పప్పులను కానుకగా ఇవ్వాలని ఈ ప్రచారం సూచిస్తోంది. కార్యాలయ స్నేహితులు, జిమ్ స్నేహితులు, ప్రయాణ సహచరులు, కాఫీ స్నేహితులు వంటి విభిన్న సంబంధాలను ఇందులో ప్రస్తావించింది. సంగీత ప్రధానంగా రూపొందించిన ప్రచార చిత్రంలో 'పార్టీ బడ్డీ', 'ట్రావెల్ బడ్డీ', 'కూల్ ఆంటీ' వంటి పాత్రల ద్వారా స్నేహబంధాలను వేడుకగా చూపించారు. కొత్త తరం తమ కుటుంబం, స్నేహితులు, పరిచయ వర్గాలతో కలిసి పండుగలను జరుపుకునే విధానం మారుతున్న నేపథ్యంలో ఈ ప్రచారం రూపొందించినట్లు సంస్థ తెలిపింది. తరతరాలుగా దీపావళి కానుకల్లో భాగమైన బాదం పప్పులకు ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను కొనసాగిస్తూ, యువతతో కొత్త శైలిలో అనుసంధానం కావడమే లక్ష్యమని ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఇండియా మార్కెట్ లీడ్ మణి పాండర్ తెలిపారు. స్నేహం, ఆప్యాయత, ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రతీకగా బాదం పప్పులను ఈ దీపావళికి బహుమతిగా ఇవ్వాలని ప్రచారం కోరుతోంది.

మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి
- మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్



అమరావతి, మహానగర్

రాష్ట్రంలోని మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం మంగళగిరిలోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో చైర్మన్ ఫారూక్ షుబ్లీ అధ్యక్షతన రూ.3.31 కోట్లతో 36 కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లకు 216 కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి యువతకు మెరుగైన కంప్యూటర్ శిక్షణ, డిజిటల్ నైపుణ్యాలు, ఉపాధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిక్షణ కేంద్రాలకు కంప్యూటర్ల పంపిణీలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ చేపట్టిన కార్యాచరణను మంత్రి అభినందించారు. కర్నూలు, నంద్యాల, మంగళగిరి, విశాఖపట్నం, గుంటూరు, మదనపల్లె సీటీసీలను ప్రత్యేకంగా మోడల్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ఉర్దూ సీటీసీల ఆధునీకరణ, మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలను మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, సభ్యుడు మహమ్మద్ అక్రమ్, వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాదర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నిజాముద్దీన్, దూదేకుల, నూర్భాష ఫెడరేషన్ డైరెక్టర్ గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



కైకలూరు, మహానగర్

వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత వారి వారసులపై ఉందని జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివ కిరణ్ అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా మండలంలోని తామరకొల్లు గ్రామంలోని మదర్ తెరిసా వృద్ధాశ్రమంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి శివ కిరణ్ మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణకు సీనియర్ సిటిజన్స్ యాక్ట్ వంటి చట్టాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని, అవసరమైతే వారి ఆస్తిని తిరిగి పొందే అవకాశం కూడా ఉందని వివరించారు. ప్రభుత్వ పింఛన్లు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేస్తే న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకుడు రాఫెయిల్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీపీ పవన్ కాంత్, ప్యానల్ అడ్వకేట్లు శివప్రసాద్, చావలి శంకర శాస్త్రి, పత్తే ప్రసన్నకుమార్, పారాలీగల్ వాలంటీర్లు, ఎంఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్‌కు ఘన సన్మానం



అవనిగడ్డ, మహానగర్

ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఆకుల హరిప్రసాద్ సంస్థ సీఈఓ, ఎండీ ఆర్. దొరైస్వామి చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. బెంగళూరులో ఇటీవల నిర్వహించిన మూడు రాష్ట్రాల స్థాయి బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో హరిప్రసాద్‌ను దొరైస్వామి సత్కరించారు. మచిలీపట్నం డివిజన్ పరిధిలో అవనిగడ్డ ఎల్ఐసీ బ్రాంచ్ ఉత్తమ పనితీరు కనబరచడం, సెప్టెంబర్‌లో అధిక వ్యాపారం సాధించడం, ఆనందా పాలసీల విక్రయంలో మొదటి స్థానంలో నిలవడం, జీవన్ రక్ష పాలసీల్లోనూ డివిజన్ స్థాయిలో అగ్రస్థానం సాధించడంతో హరిప్రసాద్‌ను సన్మానించారు. అంతేకాకుండా ఎండీ దొరైస్వామితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసే అవకాశం కూడా హరిప్రసాద్‌కు లభించింది. ఈ సందర్భంగా గురువారం అవనిగడ్డ బ్రాంచ్ కార్యాలయంలో అధికారులు, ఏజెంట్లు ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. బ్రాంచ్ మేనేజర్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు ఏజెంట్లకు అందుబాటులో ఉంటూ వ్యాపార విస్తరణకు ప్రత్యేక శైలిలో కృషి చేసి బ్రాంచ్ అభివృద్ధికి తోడ్పడ్డారని వారు కొనియాడారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ బ్రాంచ్ ఉన్నత స్థానంలో నిలవడం సంతోషంగా ఉందని, ఎల్ఐసీ అధికారులు, ఏజెంట్ల సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఏజెంట్లు కష్టపడి అధిక వ్యాపారం చేయడం వల్ల శాఖకు గుర్తింపు లభించిందని, అవనిగడ్డ శాఖ భవిష్యత్తులోనూ ఉన్నత స్థానంలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాదివాడ నిరంజనరావు, అంబటి వెంకటేశ్వరరావు, రాఘవరావు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పత్రాల అందజేత

విజయవాడ, మహానగర్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన--2.0 పథకం ద్వారా అర్హులైన 36 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనసేన పార్టీ 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన--2.0 ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు 36 మంది లబ్ధిదారులకు పక్కా గృహాల మంజూరు పత్రాలు అందజేశామని తెలిపారు. సొంతింటి కల నెరవేరుతున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలన్నింటికీ సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీఎంఏవై--2.0 కింద కేంద్రం నుంచి రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందుతుందని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ విజయవాడ డివిజన్ ఈఈ జీ. కపూర్ తెలిపారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో మరికొంతమంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ. పిచ్చయ్య, ఏఈ కే. రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పత్తి నాగేశ్వరరావు, దాడి అప్పారావు, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, పులిచేరి రమేష్, రౌతు వాసు, విశ్వంశెట్టి విశ్వేశ్వరరావు, జయబాలన్, పల్లంటి ఆది, బాదర్ల శివ, శనివారపు శివ, నాగోతి రామారావు, పోతినిడి లోకేష్, కొప్పుల గంగాధర్, కొమర కిరణ్, బొమ్ము రాంబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతలకు సన్మానం

అవనిగడ్డ, మహానగర్



నియోజకవర్గంలో రెండు ప్రభుత్వ వసతి గృహాలకు జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు రావటం అభినందనీయం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర అవార్డులు అందుకున్న మోపిదేవి ఎస్సీ వసతి గృహం సంక్షేమ అధికారిణి యాసం శివ నాగలక్ష్మి, తలగడదీవి బీసీ వసతి గృహం సంక్షేమ అధికారిణి డీ.వెస్లీరాణిలను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులకు వసతి గృహాల్లో స్వచ్ఛమైన వాతావరణం, పరిసరాలు నెలకొల్పటం ఆదర్శనీయం అన్నారు. ఈ అవార్డుతో పాటు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి యాసం శివ నాగలక్ష్మి ఇటీవల ఆగష్టు 15 సందర్భంగా జిల్లా బెస్ట్ హెచ్.డబ్ల్యూ.ఓ అవార్డు కూడా అందుకోవటం ప్రశంసనీయం అన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ మల్లవరపు విజయ, వసతి గృహం సంక్షేమ అధికారులు ఆవుల భాస్కరరావు, కొక్కిలిగడ్డ నాగార్జున, బంద్రెడ్డి విష్ణు, షుకూర్, కే.వెంకటేశ్వరరావు, బీ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాల ఆవిష్కరణ



ఆగిరిపల్లి, మహానగర్

మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ లక్ష్మణ్ రావు రూపొందించిన మెటీరియల్‌ను గురువారం ఆగిరిపల్లి హైస్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ఏడు పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు అర్హులని, పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల స్కాలర్‌షిప్ లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలకు సుమారు 100 పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, మండల విద్యాశాఖ అధికారి-2 కొవ్వలి ఆనంద్ కుమార్, జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి ఎం. రత్న కమలబాబు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్..
వెయ్యి మంది తొలగింపు..
మొత్తం 30 వేల మందిని తొలగించే యోచన!



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీగా ఉద్యోగులను తొలగించింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్ అమెరికా యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్స్ ప్రభావం పడింది. రానున్న రోజుల్లో దాదాపు 30 వేల మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా ఉద్యోగుల కోతలు ఉన్నాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తాజాగా తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. తమ ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశామని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు కరోనా మహమ్మారి సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రస్తుత తొలగింపులకు కారణమని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారని, అది తమకు చాలా ఒత్తిడితో కూడిన కాలమని, అందుకే అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నామని 'ఫాక్స్ న్యూస్' కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బెజోస్ పేర్కొన్నారు. కాగా భారత్‌లో 'అమెజాన్ గ్రేట్ ఇండియన్' ఫెస్టివల్ సేల్.. ప్రపంచవ్యాప్తంగా 'ప్రైమ్ బిగ్ డీల్ డేస్' సేల్ ప్రారంభమైన తరుణంలోనే ఈ లేఆఫ్‌లు జరగడం గమనార్హం. మంగళవారం రోజున ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కంపెనీ ఉన్నతాధికారులు సమాచారం అందించారు. దాంతో ప్రభావిత ఉద్యోగులు కంపెనీ అంతర్గత స్లాక్ ఛానెల్‌లో సెవరెన్స్ ప్యాకేజీ, నోటీస్ పీరియడ్, ఇతర అవకాశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ మరోవైపు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

విమాన ప్రయాణికులకు షాక్..
ఫ్యూయల్ సర్‌ఛార్జీ పెంచేసిన ఎయిరిండియా

టాటా గ్రూప్‌సకు చెందిన ఎయిరిండియా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు షాకిచ్చాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై ఫ్యూయల్ సర్‌ఛార్జీలను పెంచేశాయి. పెరిగిన ధరలు అక్టోబర్ 9 నుంచే అమల్లోకి రానున్నాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఎయిరిండియా ఈ నిర్ణయం తీసుకుంది. మరో విమానయాన సంస్థ ఇండిగో సర్‌ఛార్జీలను పెంచిన కొద్దిరోజులకే ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఏటీఎఫ్ ధరల పెరుగుదలతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగిందని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు ఫ్యూయల్ సర్‌ఛార్జీ రూ.400 నుంచి రూ.1200 మేర పెంచుతున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 55 డాలర్ల నుంచి 215 డాలర్ల మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇండిగో సంస్థ దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు రూ.100 నుంచి రూ.350 మేర సర్‌ఛార్జీ భారాన్ని మోపింది. ఆకాశ ఎయిర్ కూడా: మరో ప్రైవేటు విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్.. దేశీయ విమాన సర్వీసులకు ఫ్యూయల్ సర్‌ఛార్జీ విధానాన్ని తిరిగి తీసుకొచ్చింది. అంతర్జాతీయ విమాన సర్వీసులపై ప్రస్తుతం విధిస్తున్న సర్‌ఛార్జీని మరింత పెంచింది.

యూపీఐ లావాదేవీలపై ఛార్జెస్ జనవరి నుంచి?
త్వరలో అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం



యూపీఐ ద్వారా జరిగే రూ.2000పైన లావాదేవీలపై ప్రతిపాదించిన ఛార్జీల అమలును కొన్ని నెలలపాటు వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం ఉన్నది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలను అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ నిర్ణయంవల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరుకుంది. అదేవిధంగా పండగల సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుంది. కాగా ఆరేళ్లకుపైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగ దారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారులవైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకుపైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 లోనే యూపీఐ ద్వారా రూ.29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే అది దసరా, దీపావళి వంటి పండగల వేళ వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలుగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభించనుంది.

స్టాక్ మార్కెట్ భారీ పతనం..
ఒక్కరోజే రూ.11 లక్షల కోట్ల సంపద ఆవిరి



భారత్ స్టాక్ మార్కెట్ గురువారం భారీగా పతనమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,000 పాయింట్లకుపైగా నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 371 పాయింట్లు నష్టపోయింది. దీంతో ఇన్వెస్టర్లు ఈ ఒక్కరోజే దాదాపు రూ.11 లక్షల కోట్ల వరకు పోగొట్టుకున్నారు. ఆర్బీఐ రెపో రేట్ పెంపు, రూపాయి బలహీన పడటం, క్రూడాయిల్ ధర పెరగడం వంటివన్నీ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ట్రేడింగ్ ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 72,668.00 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ప్రారంభమైంది. తర్వాత 71,327.75 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. చివరకు 1,045.46 పాయింట్ల నష్టంతో 71,593.24 వద్ద ముగిసింది. 1.44 శాతం నష్టపోయింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్ల (1.64 శాతం) నష్టంతో 22,231.80 వద్ద ముగిసింది. ఈ భారీ నష్టం కారణంగా బీఎస్ఈలో నమోదైన కంపెనీలు రూ.11.37 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇంతకుముందు రోజు మొత్తం మార్కెట్ విలువ రూ.4,72,35,273.39 కోట్లుగా ఉండగా, ఈ రోజు అది రూ.4,60,97,838.63 కోట్లకు తగ్గింది. మరోవైపు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.25 శాతం పెరిగి, 104.46 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 96.78కి చేరింది. గత మే నెలలో అత్యంత కనిష్ట స్థాయి 96.69. గురువారం దీనికి దగ్గరగా రూపాయి విలువ పడిపోయింది. మరోవైపు యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల పెంపును కేంద్రం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ నెలలో అమలు కావాల్సిన ఛార్జీలు వచ్చే జనవరి వరకు వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

ఐపీఎల్‌తో మరోసారి పోటీపడనున్న
పాకిస్తాన్ సూపర్ లీగ్



పాకిస్తాన్ సూపర్ లీగ్ మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో పోటీపడనుంది. ఐపీఎల్ జరిగే సమయంలోనే మరోసారి పీఎస్ఎల్‌ను ప్లాన్ చేశారు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారులు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. దీంతో కొంతమంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్ ఒప్పందాల నుంచి తప్పుకుని ఐపీఎల్‌లో చేరారు. ఈ చేదు అనుభవం చవిచూశాక కూడా పీఎస్ఎల్ ఐపీఎల్‌తో ఢీకొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పీఎస్ఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన తేదీలను లీగ్ నిర్వహకులు ఇవాళ ప్రకటించారు. ఈ టోర్నీలో వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు జరుగనుంది. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి తేదీలు ఖరారు కానప్పటికీ.. ఇంచుమించు పీఎస్ఎల్ జరిగే సమయంలోనే ఐపీఎల్ కూడా జరుగుతుంది. ప్రస్తుతమున్న సమాచారం? ప్రకారం ఐపీఎల్ 2027 మార్చి మధ్యలో మొదలవుతుంది. ఐపీఎల్, పీఎస్ఎల్ మరోసారి క్లాష్ కానున్న నేపథ్యంలో మరోసారి విదేశీ ఆటగాళ్ల కోసం రెండు లీగ్‌ల మధ్య పోటీ తప్పకపోవచ్చు. గత సీజన్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్‌కు డైరెక్ట్ సైనింగ్‌గా ఎంపికైన స్పెన్సర్ జాన్సన్.. వ్యక్తిగత కారణాలు సాకుగా చూపి పీఎస్ఎల్ నుంచి వైదొలిగి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరాడు. శ్రీలంక ఆటగాడు దసున్ షనక లాహోర్ ఖలందర్స్ డీల్‌ను కాదనుకొని రాజస్తాన్ రాయల్స్‌లో చేరాడు. బ్లెస్సింగ్ ముజారబాని ఇస్లామాబాద్ యునైటెడ్‌తో ఒప్పందం రద్దు చేసుకొని కోల్‌కతా నైట్ రైడర్స్‌లో చేరాడు. దీంతో ముజారబానిపై రూ.రెండేళ్ల నిషేధం విధించింది.

స్పోర్ట్స్

నా ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధించింది



ఇంటర్నెట్ డెస్క్: తనను భారత క్రికెట్ జట్టుకు డైరక్టర్‌గా తప్పించడం సరిగా అనిపించలేదని రవిశాస్త్రి తెలిపారు. 2016లో తనను కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించారని.. తన ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం మరింత బాధించిందని గుర్తు చేసుకున్నారు. 2014లో టీమ్‌ఇండియాకు రవిశాస్త్రి డైరక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నారు. రెండేళ్ల తర్వాత ఆ పదవిని బీసీసీఐ తీసేసింది. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేయాలని రవిశాస్త్రికి సూచించింది. సౌరభ్ గంగూలీ, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి చివరి క్షణంలో రవిశాస్త్రిని కాదని కుంబ్లేను ఎంపిక చేసింది. "నేను డైరక్టర్‌గా ఉన్నా. రెండేళ్ల తర్వాత బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దుచేస్తున్నాం.. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయమని చెప్పింది. నన్ను బయటకు పంపించేందుకు మరో కారణం ఉందని అనిపించింది. ఆ నిర్ణయం నన్ను చాలా బాధించింది. జట్టు కోసం నా శాయశక్తులా కృషి చేశా. నన్ను ఇంటర్వ్యూ చేసేందుకూ గంగూలీ (ూశీబతీుఱ ుఅస్త్రబశ్రీఎ) గైర్హాజరు కావడం మరింత బాధపెట్టింది" అని రవిశాస్త్రి తెలిపారు.

మళ్లీ వచ్చేశా..

"నా వ్యాఖ్యాత పాత్రను పోషించేందుకు వెళ్లిపోయా. ఆటతోనే మమేకమై ఉన్నా. దాదాపు ఏడాదిన్నరపాటు మంచి అనుభవం సంపాదించా. ఎన్నో పాఠాలను నేర్చుకున్నా. ప్రధాన కోచ్‌గా భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చా. ఆటగాళ్లు ఎలా ఆలోచిస్తున్నారనేది అర్థం చేసుకున్నా. జీవితంలో ఇలాంటి ఒడుదొడుకులు సహజమే. వాటన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగా. అవకాశం అందిపుచ్చుకున్నా" అని రవిశాస్త్రి తెలిపారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ - రవిశాస్త్రి ద్వయం హయాంలో భారత్ (ఱఘఎ ×అఒఘు) విదేశాల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

విండీస్‌తో రెండో టీ20కి ముందు వైభవ్ విధ్వంసం



విండీస్‌తో రేపు జరుగబోయే రెండో టీ20కి ముందు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జట్టు మేనేజ్‌మెంట్‌కు స్ట్రాంగ్ మెసేజ్ పంపాడు. నెట్స్‌లో అతడు భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అలవోకగా బౌండరీలు, సిక్సర్లు బాదాడు. జట్టు సమీకరణల వల్ల వైభవ్‌కు అవకాశాలు రాని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైభవ్ తనలోని విధ్వంసకర కోణాన్ని మేనేజ్‌మెంట్‌కు మరోసారి గుర్తు చేశాడు. నెట్స్‌లో పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ కూడా చెలరేగిపోయాడు. వైభవ్‌తో పోటీపడి మరీ షాట్లు ఆడాడు. వీరిద్దరి బ్యాటింగ్ విన్యాసాలు చూసి పోలీసులు, ప్రేక్షకులు, మీడియా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, రెండో టీ20 రాంచీ వేదికగా జరుగనుంది. ఇది ఇషాన్ కిషన్‌కు సొంత మైదానం. రేపటి మ్యాచ్‌లో ఇషాన్ ప్రదర్శన కోసం? స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, రేపటి మ్యాచ్‌లో భారత్ ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగవచ్చు. ఇదే జరిగితే వైభవ్ సూర్యవంశీకి మరోసారి నిరాశ తప్పదు. మేనేజ్‌మెంట్ సంజూ శాంసన్‌పై విశ్వాసాన్ని కొనసాగించినంత కాలం వైభవ్‌ది ఇదే పరిస్థితి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో కొనసాగుతుంది. లక్నో వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లో తొలి టీ20 శతకంతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు.



స్పిరిట్‌లో ప్రభాస్ డబుల్ లుక్

సెకండాఫ్‌లో ఊహించని అవతారం?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటిస్తున్న అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో 'స్పిరిట్' ఒకటి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తనదైన మేకింగ్ శైలిని చూపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 'స్పిరిట్' గురించి వస్తున్న వార్తలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఓ ఆసక్తికరమైన సమాచారం ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ గతంలో ఎన్నడూ కనిపించని విధంగా రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. 'స్పిరిట్'లో ప్రభాస్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు తగ్గట్టుగా ఒక ప్రత్యేకమైన లుక్‌లో ఆయన కనిపిస్తారని తెలుస్తోంది. అయితే సినిమా ద్వితీయార్ధంలో ప్రభాస్ మరో భిన్నమైన అవతారంలో కనిపిస్తారనే ప్రచారం ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ రెండు లుక్స్ మధ్య వ్యత్యాసం ఎలా ఉండబోతోంది? కథలో వచ్చే మలుపులకు ప్రభాస్ పాత్ర ఎలా అనుసంధానమై ఉంటుంది? అనే విషయాలపై అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'స్పిరిట్'లో మాఫియా నేపథ్యానికి కూడా ప్రాధాన్యత ఉండనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ పాత్రలో వచ్చే మార్పులు కథను ఏ మలుపు తిప్పుతాయన్నది ఆసక్తికరంగా మారింది. పోలీస్ అధికారిగా ఆయన కనిపించే విధానం ఒకవైపు ఉంటే, ద్వితీయార్ధంలో మరో కోణంలో కనిపించడం సినిమాకు కీలక ఆకర్షణగా నిలవవచ్చని అభిమానులు భావిస్తున్నారు. అయితే కథ, పాత్రల స్వరూపం, ప్రభాస్ లుక్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న సమాచారం నిజమైతే.. ప్రభాస్‌ను సరికొత్తగా చూపించేందుకు సందీప్ రెడ్డి వంగా ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు భావించవచ్చు. ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా క్రేజ్, సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో కనిపించే తీవ్రత, విభిన్నమైన పాత్రల రూపకల్పన ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి. దర్శకుడి గత చిత్రాలు ప్రేక్షకుల్లో సృష్టించిన ప్రభావం నేపథ్యంలో 'స్పిరిట్' ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది.



దండోరా దర్శకుడితో నితిన్ అలియాస్ రుక్మిణి విడుదల తేదీపై కీలక అప్‌డేట్!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఒకవైపు హీరోగా 'ది ప్యారడైజ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకొని మరోవైపు నిర్మాతగా వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలోనే యంగ్ హీరో నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా రొమాంటిక్ డ్రామా 'అలియాస్ రుక్మిణి' చిత్రానికి ఆయన నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'దండోరా' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మురళి కాంత్ దేవోత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో, టాలీవుడ్ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా విడుదలకు సంబంధించిన ముఖ్యమైన అప్‌డేట్‌ను రేపు ఉదయం సరిగ్గా 10:08 గంటలకు అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రపు గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేయగా, ఇప్పుడు రాబోయే రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఈ చిత్రంలో నితిన్ సరసన నటిస్తున్న హీరోయిన్ ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. త్వరలోనే దీనిపై కూడా చిత్ర బృందం నుంచి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. 'యూనిసానిమస్ ప్రొడక్షన్స్' పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



గ్లామర్‌కే పరిమితం కావాలనుకోవడం లేదు.. ఇకపై అలాంటి పాత్రలే చేస్తా

బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దిశా పటాని ఇప్పుడు తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఇకపై వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటోందనే అంశాలపై దిశా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దిశా పటాని తొలిసారిగా 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని దిశా తెలిపింది. విభిన్నమైన అనుభవాలు తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని చెప్పింది. ఇప్పటివరకు తాను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించినప్పటికీ, ఇకపై తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించింది. సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఈ విషయాన్ని దిశా పటాని కూడా గుర్తించినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, తనలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా తెలిపింది. ప్రేక్షకులు తన పాత్రతో భావోద్వేగపరంగా అనుసంధానమయ్యేలా ఉండాలని, కథను ముందుకు తీసుకెళ్లడంలో ఆ పాత్రకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం దిశా పటాని 'హోలీగార్డ్: సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. భారతీయ సినిమాలతో పాటు అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఆమెకు ఈ చిత్రం కెరీర్‌లో మరో కీలక అడుగు కానుంది.



పనిగట్టుకుని మరీ చేస్తున్నారు.. ఎందుకు ఇలాంటి పనులు?

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ సంచలన కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో తనపై, భార్య రష్మికపై వస్తున్న ట్రోల్స్, నెగిటివిటీపై సీరియస్‌గా స్పందించారు. రణబాలి ట్రైలర్ ఈవెంట్‌కు హాజరైన విజయ్.. విమర్శలపై స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. నా సెల్ఫ్ కాన్ఫిడెన్స్ వాళ్లకు బలుపులా అనిపిస్తే నేను తగ్గాలా? ఎవరికోసం నేను మారబోనంటూ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌లో 90 శాతం కావాలని ఒక గ్రూప్ క్రియేట్ చేస్తున్నవేనని విజయ్ దేవరకొండ ఆరోపించారు. ఒక 50 మంది కూర్చుని ఒక్కొక్కరు 20 నుంచి 1000 అకౌంట్స్ క్రియేట్ చేసి కావాలని నెగిటివిటీని సృష్టిస్తున్నారని విజయ్ విమర్శించారు. రణబాలి సినిమా ట్రైలర్ రాకముందే ఇది బ్రిటీశ్ సినిమా అంటూ కొన్ని వర్గాలు కావాలని వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎవరినైనా కలవకుండానే, వ్యక్తిగతంగా తెలియకుండానే ఇలా బలమైన అభిప్రాయాలను క్రియేట్ చేయడం వెనుక ఒక పెద్ద మెషినరీ పనిచేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. తెలుగు సినిమా అయిన రణబాలి కాకుండా మనం జైలర్-2కు పోదాం అని సడెన్‌గా 50 అకౌంట్స్ నుంచి ఒకే రీల్ షేర్ అవుతుందన్నారు. అందరూ ఒకే అభిప్రాయాన్ని రీల్‌గా షేర్ చేస్తున్నారంటే ఎవరో కూర్చొని డబ్బులు పెట్టి మరీ చేయిస్తున్నారని అర్థం.. వ్యవస్థ అలా తయారైంది. దీన్ని మనం ఆపలేమన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ..' ఇప్పుడు డబ్బులు ఇచ్చి చేయిస్తున్న వాడు రేపు ఏఐతో కూడా అదే పని చేయిస్తారు. అప్పుడు ఈ పనిచేసే వాళ్లు ఏం చేస్తారు? సినిమాను ప్రచారం చేయడానికి నేను సపోర్ట్ చేస్తా. ఎవరో ఒకరు బాగుపడతారు. అదే టూల్‌ను ఒకరిని కిందకు లాగడానికి ఉపయోగిస్తే ఎందుకురా ఈ పనులు అనిపిస్తుంది. ఇలా ఇండస్ట్రీలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి నాకు ఏడేళ్లు పట్టింది. నేను ఖాళీ చేతులతో వచ్చి, నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వచ్చా. ఏడేళ్ల నుంచి అర్థం కాలేదు. గత ఏడాది ఈ విషయంలో క్లారిటీ వచ్చింది. నాకు ఏం జరుగుతుందో అర్థమైంది' అనిఅన్నారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999